నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, శనివారం 14 డిసెంబర్ 2024 | YADADRI BHUVANAGIRI

నేడు జాతీయ లోక్ అదాలత్

రామగిరి, డిసెంబర్ 13 : జాతీయ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాలతో జిల్లాలోని అన్ని కోర్టుల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు నల్లగొండ జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి డీవీఆర్ తేజో కార్తీక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో కార్యక్రమం ప్రారంభమవుతుందని, కిక్షిదారులు హాజరై సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

యూఆర్ఎస్‌లో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు 16న హాజరుకావాలి : డీఈఓ

రామగిరి, డిసెంబర్ 13 : జిల్లాలోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్లలో ఖాళీగా ఉన్న ప్రత్యేకాధికారి, సీఆర్‌టీ సైన్స్ పోస్టులకు 1:3లో ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 16న డీఈఓ కార్యాలయంలో నిర్వహించే సర్టిఫికెట్ పరిశీలనకు హాజరుకావాలని డీఈఓ భిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్య, ఎక్స్ అఫీషియో రాష్ట్ర పథక సంచాలకులు, సమగ్ర శిక్ష తెలంగాణ జారీ చేసిన నోటిఫికేషన్‌లో ఎంపికై మెరిట్ జాబితా నుంచి ఖాళీకి అనుగుణంగా అభ్యర్థులను ఎంపిక చేశారని పేర్కొన్నారు. 1:3 అభ్యర్థుల జాబితాను డీఈఓ నల్లగొండ బ్లాగ్ స్పాట్‌లో నమోదు చేశామన్నారు. జాబితాలోని అభ్యర్థులు ఉదయం 10గంటలకు హాజరుకావాలని తెలిపారు.

సమ్మెతో సాగని చదువులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కేజీబీవీలో నిలిచిన విద్యా బోధన

- మరో మూడు నెలల్లో పదోతరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు.. ఆందోళనలో విద్యార్థులు
- సమగ్రశిక్షలో పనిచేస్తున్న 2,192 మంది ఉద్యోగులు సమ్మెలోనే.. తెరుచుకోని ఎమ్మార్సీలు.. భవిత సెంటర్లు

ఎన్నికలకు ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని, తమకు మినిమం టైం స్కేల్ ఇవ్వడంతోపాటు.. సర్వీసులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ విద్యాశాఖ- సమగ్ర శిక్షలో వివిధ హోదాలో పనిచేసే ఉద్యోగులు సమ్మెకు దిగారు. వాటిలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో పనిచేసే ప్రత్యేకాధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది ఉండడంతో చదువులు సాగడం లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 59 కేజీబీవీలో విద్యాబోధన నిలిచిపోయింది. మరో రెండు, మూడు నెలల్లో ఇంటర్మీడియట్, టెన్త్ పబ్లిక్ పరీక్షలు ఉండటంతో విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సమగ్ర శిక్షలో పని చేస్తున్న 2,192 మంది ఉద్యోగులు సమ్మెలో కొనసాగుతుండటంతో ఎమ్మార్సీలు, భవిత సెంటర్లు తాళాలతో దర్శనమిస్తున్నాయి. దాంతో వారం రోజులుగా చదువులకు బ్రేక్ పడింది. కేజీబీవీలో మాత్రం ఒక టీచర్, ఒక పీఈటీ చొప్పున విధులు నిర్వహిస్తూ సమ్మెలో పాల్గొంటున్నారు. దాంతో ఆయా పాఠశాలల్లోని 7వేల మందికి పైగా విద్యార్థులు హాస్టల్ గదులకే పరిమితమయ్యారు.

– రామగిరి, డిసెంబర్ 13

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెతో మూతపడ్డ హాలియాలోని ఎమ్మార్సీ కార్యాలయం

సమ్మెతో పలు విభాగాల్లో సేవలకు ఆటంకం

మండల వనరుల కేంద్రాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, మెసెంజర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్స్ సమ్మెలోనే ఉంటున్నారు. దాంతో వాటికి తాళాలు కూడా తీయడం లేదు. అదే విధంగా ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సేవలందించే ఐఈఆర్‌పీలు, ఉమ్మడి జిల్లాలోని 100 భవిత సెంటర్స్ మూతపడటంతో సుమారు 8వేలకుపైగా విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో కీలక భూమిక పోషిస్తున్న క్లస్టర్ రీసోర్స్‌పర్సన్స్(సీఆర్‌పీలు) సమ్మెలో ఉండటంతో పలు సేవలకు ఆటంకం ఏర్పడింది. మరోవైపు విద్యార్థులకు కో కరిక్యులమ్ అంశాలు నేర్పించే పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్స్ సైతం సమ్మెలో కొనసాగుతున్నారు. దాంతో ఆయా పాఠశాలల్లో బోధనకు అంతరాయం కలుగుతున్నది. ఇక అర్బన్ రెసిడెన్షియల్‌లో పనిచేసే బోధన, బోధనేతర సిబ్బంది, విద్యాశాఖ–సమగ్రశిక్ష జిల్లా కార్యాలయంలో పనిచేసే ఏపీఓ, ఇతర హోదాల సిబ్బంది సమ్మెలో పాల్గొంటున్నారు.

ప్రభుత్వ పంతంతోనే సమస్యలు

ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూళ్లలో బోధించే సిబ్బంది మాదిరిగానే మేము 24 గంటలు విధుల్లో ఉంటున్నాం. వారికిస్తున్న లక్షల వేతనాలు కాకపోయినా కనీస వేతనాలు కూడా ఇవ్వరా..? ఇదెక్కడి న్యాయం.? ఇంత దారుణంగా వెట్టిచాకిరి చేయించుకుంటారా..? మేము సమ్మెలో ఉన్నప్పటికీ పిల్లలకు ఇబ్బంది లేకుండా భోజనం పెడుతున్నాం. ప్రతి రోజూ ఒక ఉపాధ్యాయురాలిని విద్యార్థుల పర్యవేక్షణకు ఉంచుతూ రక్షణ కల్పిస్తున్నాం. ప్రభుత్వ పంతం కారణంగానే పిల్లల భవిష్యత్తు దెబ్బతింటుంది. ప్రభుత్వ వెంటనే స్పందించి సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి.

- నీలాంబరి, ఎస్ఓ, కేజీబీవీ, కట్టంగూర్

మర్రిగూడ : కేజీబీవీలో పాఠాలు బోధించేవారు లేక ఆడుకుంటున్న విద్యార్థినులు

సీఎం రేవంత్‌రెడ్డి మాట నిలబెట్టుకోవాలి

సమగ్ర శిక్షలో ప్రభుత్వ టీచర్స్, ఇతర ఉద్యోగులతో సమానంగా ఏండ్ల తరబడి పనిచేస్తున్నాం. చాలీచాలని వేతనాలతో జీవితం గడుపుతున్నాం. ఒడిశా, మహారాష్ట్ర, హర్యానాలో మాలాంటి ఉద్యోగులను అక్కడి ప్రభుత్వాలు క్రమబద్ధీకరించాయి. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. సమస్యలు పరిష్కరించే వరకు ఐక్యంగా ఉండి సమ్మె కొనసాగిస్తాం.

- మొలుగురి కృష్ణ, సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షుడు

గ్రూప్-2కు సర్వం సిద్ధం

రేపు, ఎల్లుండి పరీక్షల నిర్వహణ

- నల్లగొండ జిల్లాలో 87.. సూర్యాపేటలో 49.. యాదాద్రిలో 14 పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న 52,109 మంది అభ్యర్థులు
- బయోమెట్రిక్ ద్వారా హాజరు
- ఉదయం 9:30.. మధ్యాహ్నం 2:30 గంటలకు పరీక్ష కేంద్రాల గేట్లు మూత

రామగిరి/భువనగిరి కలెక్టరేట్ : డిసెంబర్ 13 : తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఈ నెల 15, 16న నిర్వహించే గ్రూప్ –2 పరీక్షకు ఉమ్మడి జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. నల్లగొండ జిల్లాలో రెండు పట్టణ ప్రాంతాల్లో 87 పరీక్ష కేంద్రాలను (నల్లగొండలో 59, మిర్యాలగూడలో 28) ఏర్పాటు చేయగా 29,174 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఒక పరీక్ష, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మరో పరీక్ష నిర్వహించనున్నారు. ఉదయం 9:30, మధ్యాహ్నం 2:30 గంటల తర్వాత ఆయా పరీక్ష కేంద్రాల లోపలికి అభ్యర్థులను అనుమతించరు. దీని దృష్టిలో ఉంచుకుని పరీక్ష కేంద్రాలకు ముందుగానే చేరుకోవాల్సి ఉంటుంది. పరీక్ష కేంద్రంలో అభ్యర్థులందరికీ ప్రతి పరీక్షకు వేర్వేరుగా బయోమెట్రిక్ హాజరు ఉంటుంది. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా అన్ని మౌలిక వసతులు కల్పించారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద పరీక్ష ముగిసే వరకు నిరంతరాయంగా విద్యుత్ ఉండేలా చర్యలు తీసుకున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచనున్నారు. పరీక్ష కేంద్రంలోని అధికారులు, సిబ్బంది విధిగా ఐడీ కార్డులు ధరించాల్సి ఉంటుంది. పరీక్ష మెటీరియల్స్ తరలింపు కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. అభ్యర్థులకు పరీక్ష కేంద్రంలో ఇన్విజిలెటర్స్ ఓఎంఆర్ షీట్ పూర్తి చేసే విధానంపై అవగాహన కల్పిస్తారు. దాని తర్వాతే పూర్తి చేయాల్సి ఉంటుంది. తప్పులు చేస్తే సరిచేయడానికి అవకాశం ఉండదు. సూర్యాపేట జిల్లాలో 49 పరీక్ష కేంద్రాలు (సూర్యాపేటలో 30, కోదాడలో 19) ఏర్పాటు చేయగా 16,857 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో 14 కేంద్రాలు ఏర్పాటు చేయగా 6,078 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు.

వీటితో రావాలి..

- పరీక్ష కేంద్రంలోకి హాల్ టికెట్, బ్లూ లేదా బ్లాక్ పాయింట్ పెన్ను
- ఏదైనా ఒరిజినల్ గుర్తింపు కార్డు(ఆధార్, పాన్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీ ఇలా..)
- హాల్ టికెట్‌పై ఫొటో రానిపక్షంలో దానిపై ఫొటో అంటించి గెజిటెడ్ అధికారితో ధృవీకరణ చేయించాలి.

వీటిని అనుమతించరు...

- పరీక్ష కేంద్రంలోనికి ఎలక్ట్రానిక్ వాచ్, సెల్ ఫోన్, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావద్దు.
- కాళ్లకు చెప్పులు మాత్రమే ధరించి రావాలి. షూ వేసుకొని రావద్దు.

గ్రూప్-2 అభ్యర్థులు నిబంధనలు పాటించాలి : కలెక్టర్ హనుమంతరావు

గ్రూప్ –2 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ హనుమంతరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ తమ సెంటర్లను ఒక్కరోజు ముందుగా చూసుకోవాలని, పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని, పరీక్ష ప్రారంభానికి అరగంట ముందే గేట్లు మూసివేస్తారని పేర్కొన్నారు. జిల్లాలో 14 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, 6,078 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. అభ్యర్థులు టీజీపీఎస్సీ వెబ్‌సైట్ ద్వారా హాల్ టికెట్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. పరీక్ష రాసే అభ్యర్థులు హాల్ టికెట్‌ను ఏ4 సైజ్ పేపర్‌లో కలర్ ప్రింట్ తీసుకోవాలని సూచించారు. అభ్యర్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.


నామినీకి బీఆర్ఎస్ బీమా చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

బీఆర్ఎస్ కార్యకర్తలకు బీమా ధీమా

- కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

మోతె, డిసెంబర్ 13 : బీఆర్ఎస్ పార్టీ తమ కార్యకర్తలకు అండగా ఉంటుందని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. మండల పరిధిలోని తుమ్మలపల్లి గ్రామానికి చెందిన మంద ఉపేందర్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా ఆయన బీఆర్ఎస్ పార్టీ నుంచి పొందిన బీమా వచ్చింది. ఉపేందర్ భార్య మంద ఉమారాణిని వారి ఇంటి వద్దకు వెళ్లి శుక్రవారం రూ.2 లక్షల బీమా చెక్కును మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ మండల బీఆర్ఎస్ నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యమ పార్టీ నుంచి ప్రస్థానం ప్రారంభించి రాజకీయ పార్టీగా మారిన బీఆర్ఎస్ కార్యకర్తలందరికీ అండగా నిలుస్తున్నదన్నారు. కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పయనించిందని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీలో రూ.100 చెల్లించి క్రియాశీలక సభ్యత్వం పొందిన కార్యకర్తలెవరైనా ప్రమాదవశాత్తు మృతిచెందినట్లయితే నామినికి రూ.రెండు లక్షల బీమా చెక్కును పార్టీ అందజేస్తున్నదని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శీలం సైదులు, నాయకులు ఏలూరి వెంకటేశ్వర్‌రావు, మండల ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, మిక్కిలినేని సతీశ్, నవిల, రామ్‌కోటి, వెంకట్‌రెడ్డి, కోటేశ్వర్‌రావు, మాజీ సర్పంచులు, గుండాల గంగులు, గాంధీ, వాసంశెట్టి రమేశ్, శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, కోటిలింగం, బాబు, రామకృష్ణ, శ్రీను, వెంకటరెడ్డి, శ్రీనివాస్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, భిక్షం, కృష్ణారెడ్డి, ఉమేశ్, వెంకయ్య పాల్గొన్నారు.

మానవ సంబంధాలతోనే మార్పు సాధ్యం

- ప్రముఖ రచయిత అల్లం రాజయ్య

కిరణ్ వర్ధంతి సభలో మాట్లాడుతున్న అల్లం రాజయ్య, వేదికపై మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ

మిర్యాలగూడ, డిసెంబర్ 13 : మానవ సంబంధాలతోనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని రచయిత, విరసం నాయకుడు అల్లం రాజయ్య అన్నారు. అల్లం కిరణ్ వర్ధంతి సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలోని లోటస్ స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కిరణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ప్రపంచంలోని మనుషులందరూ ఒకేలా ఎందుకు ఉండరు, తేడాలు ఎందుకున్నాయి, అందరూ ఒకేలా సమానంగా బతకలేరా అనే ఆలోచనల పరంపర మానవ సంబంధాలను బలపరుస్తుందన్నారు. తెలంగాణలో 1974లోనే ఈ క్రమం మొదలైందని, అదే కాలంలో జన్మించిన కిరణ్ ఎదుగుతున్న కొద్దీ విలువలు నేర్పే కొత్త చదువులు చదవడం నేర్చుకున్నాడని తెలిపారు. గ్రామాల్లోని ఉత్పత్తి విధానం, సామాజిక కుటుంబాల ఆర్థిక విధానంపై లోతుగా అధ్యయనం చేశాడని చెప్పారు. 1999లో రాసిన మనిషి లోపలి విధ్వంసం నవలను ఇంగ్లిష్‌లోకి అనువదించేందుకు కృషి చేశారన్నారు. కిరణ్ సైన్స్‌కు ప్రాధాన్యత ఇచ్చేవాడని, సైన్స్ నశించేది కాదని, అభివృద్ధి చేసేదని తెలిపారు. ఆయన శాస్త్రీయ పరిశోధనలతో దీర్ఘకాలిక వ్యాధులకు తక్కువ ధరకే మందులు లభించేలా పరిశోధనలు చేశారన్నారు. మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ అల్లం కిరణ్ ఆశయం గొప్పదన్నారు. ఆపరేషన్ లేకుండా బ్రెయిన్ ట్యూమర్‌కు ఔషధాన్ని కనుగొని దానికి పేటెంట్ సాధించారని, దానిని స్వదేశంలో తయారు చేసి తక్కువ ధరకే రోగులకు అందించాలన్న ఆలోచనలతో కిరణ్ అమెరికా వెళ్లారని చెప్పారు. లూసియానా స్టేట్ యూనివర్సిటీలో రక్త ప్రసరణపై రసాయనాల ప్రభావం అన్న అంశంపై శాస్త్ర పరిశోధనలను చేస్తూ '4 ఎనిలినో–1, బెంజై ల్ పిపిరిడిన్–4, కార్బోనైట్రేట్ ఔషధాన్ని కనుగొన్నాడని తెలిపారు. ఆర్గానిక్ కెమిస్ట్రీలో పీహెచ్‌డీ విద్యార్థిగా కొనసాగుతున్న కిరణ్ 2007 డిసెంబర్ 13న అమెరికా తుపాకీ సంస్కృతికి బలైనాడని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు కిరణ్ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. అనంతరం సైన్స్ టాలెంట్ టెస్ట్, వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర నాయకుడు అంబటి నాగయ్య, మట్టి మనుషుల వేదక కన్వీనర్ వేనేపల్లి పాండురంగారావు, కృష్ణమూర్తి, కస్తూరి ప్రభాకర్, మోహన్‌రుషి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, కేతనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఉదయ, కొండల్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట బతుకమ్మ ఆడి నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

సమగ్ర శిక్ష ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలి

- కలెక్టరేట్ ఎదుట బతుకమ్మ ఆడి నిరసన

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 13 : సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె శుక్రవారం 4వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా కలెక్టర్ కార్యాలయం ఎదుట బతుకమ్మ ఆడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం నాయకులు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 500 పైచిలుకు సమగ్ర శిక్ష ఉద్యోగులు పనిచేస్తున్నారని, వారికి కనీస సౌకర్యాలు, ఉద్యోగ భద్రత లేదని తెలిపారు. ఏదైనా ఉద్యోగి ప్రమాదవశాత్తు మరణిస్తే కనీస ఎక్స్‌గ్రేషియా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 61 సంవత్సరాలకు రిటైర్మెంట్ అయిన ఉద్యోగికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకపోవడం దురదృష్టకరమన్నారు. వెంటనే సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెకు పీఆర్‌టీయూ తెలంగాణ డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ రేపాక గిరిధర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షులు చంద్రశేఖరరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి మల్లేశ్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు బోయ రాములు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కడెం సోమయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మల్ల వెంకన్న, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నల్ల చంద్రస్వామి, జాతీయ నాయకులు మంద శంకర్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరి మల్లేశ్, గ్రామపంచాయతీ యూనియన్ రాష్ట్ర మహిళా కన్వీనర్ కొత్త యాదమ్మ మద్దతు ప్రకటించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిలా అధ్యక్షుడు మంగ పాండరి, జిల్లా నాయకులు కర్ణాకర్, శిరీష, బొల్లెపల్లి స్వామి, మోహనాచారి, పొన్నాల రేణుక, సంధ్యారాణి, చందర్, భవాని, రవీందర్‌రెడ్డి, జహంగీర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చౌటుప్పల్ ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

చౌటుప్పల్, డిసెంబర్ 13 : చౌటుప్పల్ ప్రభుత్వ దవాఖానలో సూపరింటెండెంట్ రాజగోపాల్ మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నట్లు ఓ వైద్యురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ శుక్రవారం తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. గత నాలుగు నెలలుగా దవాఖానలో స్త్రీ వైద్య నిపుణురాలుగా ఒక డాక్టర్ పనిచేస్తున్నారు. ఆమెను మానసికంగా, డబుల్ మీనింగ్ డైలాగ్స్‌తో తీవ్ర ఇబ్బందులు పెట్టడమేకాకుండా, కులం పేరుతో దూషించినట్లు బాధితురాలు ఈ నెల 5న పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా ప్రతి పనికి అడ్డుపడుతున్నట్లు పేర్కొన్నారు. దీంతో సూపరింటెండెంట్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

'రైతుకు బేడీలు వేసిన ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి'

రామన్నపేట, డిసెంబర్ 13 : సంగారెడ్డి జిల్లా లగచర్లలో అరెస్టు అయిన రైతుకు బేడీలు వేసిన ఘటనపై ప్రభుత్వమే బాధ్యత వహించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలో అరెస్టు అయిన హీర్యానాయక్‌కు గుండె నొప్పి రావడంతో జైలు నుంచి దవాఖానకు అంబులెన్స్‌లో కాకుండా పోలీస్ వాహనంలో బేడీలు వేసి తీసుకెళ్లడం సరికాదన్నారు. రైతుకు బేడీలు వేసి దవాఖానకు తరలించిన పోలీసులపై, ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతుసంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు గన్నెబోయిన విజయ్‌భాస్కర్, కందుల హన్మంతు, నాయకులు బోళ్ల వెంకన్న, అంబటి సురేందర్‌రెడ్డి, పులి భిక్షం, కరకంటి మల్లయ్య పాల్గొన్నారు.

విద్యుత్ ప్రైవేటీకరణను తిప్పికొడుదాం

- నల్లగొండలో విద్యుత్ ఉద్యోగుల నిరసన

నల్లగొండ సిటీ, డిసెంబర్ 13 : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విద్యుత్ ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా విద్యుత్ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. నల్లగొండలోని విద్యుత్‌శాఖ ఎస్ఈ ప్రధాన ద్వారం వద్ద శుక్రవారం విద్యుత్ ఉద్యోగులు ఫ్లెక్సీలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా 1104 యూనియన్ నల్లగొండ ప్రాంతీయ అధ్యక్షుడు, జాక్ చైర్మన్ ఎన్. వెంకటయ్య మాట్లాడుతూ ఎన్‌సీసీఓఈఈఈ ఇచ్చిన పిలుపు మేరకు తెలంగాణ పవర్ ఇంజినీర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టామన్నారు. కేంద్ర ప్రభుత్వ విద్యుత్ ప్రైవేటీకరణ విధానాలను ఉద్యోగులు ఐక్యతతో తిప్పి కొట్టాలని తెలిపారు. ఇటీవల ఉత్తరప్రదేశ్, చండీగర్ విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించే ప్రయత్నానికి శ్రీకారం చుట్టిన కేంద్ర ప్రభుత్వం వైఖరిని నిరసిస్తూ ఆయా రాష్ట్ర ఉద్యోగులు ప్రాణాలకు తెగించి ఉద్యమించారని చెప్పారు. ఇప్పటికైనా విద్యుత్ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు అమ్మాలని కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు స్వస్తి పలకాలని, లేదంటే ఎంతటి ఉద్యమానికైనా వెనుకాడేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇంజినీర్ అసోసియేషన్ డీఈ నవీద్ అహ్మద్, ఇంజినీర్స్ అసోసియేషన్ నాయకులు శంకర్, వివిధ సంఘాల నాయకులు రవికుమార్, రాంబాబు, విశ్వం, వెంకన్న పాల్గొన్నారు.

నల్లగొండలో విద్యుత్‌శాఖ ఎస్ఈ ప్రధాన ద్వారం నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు